క్లుప్తంగా

యూనివర్సిటీ అభివృద్ధికి సహకరిస్తా

● ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బాలినేనిని సత్కరిస్తున్న రిజిస్ట్రార్, టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి

ఒంగోలు టౌన్: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.హరిబాబు, గవర్నమెంట్ గెజిటెడ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి శనివారం బాలినేనిని కలిశారు. విశ్వవిద్యాలయానికి కావాల్సిన నిధులు, సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి కావాల్సిన నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అందరూ కోరుకున్నట్లు యూనివర్శిటీని తీర్చిదిద్దుతానని చెప్పారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

నాగులుప్పలపాడు: డ్వాక్రా సంఘాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విడుదల చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మనబ్రోలు గ్రామంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రవికుమార్ తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు హాజరవుతారని తెలిపారు.

మినరల్ వాటర్ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శిద్దా వెంకటేశ్వరప్రసాద్

చీమకుర్తి: శిద్దా సీతారత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు శిద్దా వెంకటేశ్వరప్రసాద్ ఆర్థిక సహకారంతో శనివారం చీమకుర్తి మెయిన్‌రోడ్డులో మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి కాలంలో స్థానిక ప్రజల దాహార్తి తీర్చేందుకు గత 13 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

కొత్త ప్రాజెక్టులకు ఊతమిచ్చే ఏసీఎం



ఏసీఎం చాప్టర్‌ను ప్రారంభిస్తున్న ప్రభు

ఒంగోలు టౌన్: అసోసియేషన్ కంప్యూటింగ్ మిషనరీని ఉపయోగించుకుని విద్యార్థులు నైపుణ్యాన్ని, మెళకువలను నేర్చుకోవచ్చని హైదరాబాద్‌కు చెందిన ఏసీఎం చైర్మన్ డాక్టర్ చివుకుల శ్రీరామ ప్రభు అన్నారు. శనివారం స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏసీఎం స్టూడెంట్ చాప్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఏసీఎం చాప్టర్ ద్వారా విద్యార్థులు కంప్యూటర్ విభాగంలోని ప్రాజెక్టులు తయారు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి తెలిపారు. కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా మరిన్ని ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల సెక్రటరీ మద్దిశెట్టి శ్రీధర్ చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన బ్రాంచి మునిరాజు నాయుడు, విద్యార్థుల అధ్యయనం డెవలప్ మెంబర్ డి.శ్రీలక్ష్మి మెంబర్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగం అధిపతి డాక్టర్ సురేష్, సీహెచ్ రవీంద్రబాబు, షేక్ హీనాకౌసర్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలే

ముండ్లమూరు: ప్రజలకు ఇబ్బంది కలిగేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలుశిక్ష తప్పదని ఎస్‌ఐ సంపత్‌కుమార్ హెచ్చరించారు. మండలానికి చెందిన నలుగురు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని శనివారం దర్శి కోర్టుకు హాజరు పరచగా మెజిస్ట్రేట్ వారికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 నగదు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం
- ఒంగోలు గోపాల్‌నగర్ 4వ లైన్ నుంచి కమ్మపాలెం 3వ లైన్ వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.26.75 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని గోపాల్‌నగర్-కమ్మపాలెం మధ్యలో 20 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. స్థానిక గోపాల్‌నగర్ 4వ లైన్ నుంచి కమ్మపాలెం 3వ లైన్ వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డును టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా నిర్మించలేకపోయారన్నారు. కమ్మపాలేనికి లింక్ కలిపే ఈ రోడ్డు నిర్మాణం.. ఈ ప్రాంతాల ప్రజలకు ఒక మినీ రోడ్డు మాదిరిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ.26.75 లక్షలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపినట్లయిందన్నారు. పార్టీలకు అతీతంగా నగరంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి పూనుకున్నామన్నారు. అందులో భాగంగానే ఏళ్ల తరబడి పరిష్కారం కాని రోడ్డు సమస్యకు ఒక పరిష్కారం తీసుకొచ్చి నగర ప్రజల అవస్థలు తీరుస్తున్నామని బాలినేని పేర్కొన్నారు. తాము రోడ్డు లేని చోట రోడ్డు వేస్తామే తప్ప టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా రోడ్డు మీద రోడ్డు మాత్రం వేయమని బాలినేని అన్నారు. రూ.5 కోట్లతో నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేశామన్నారు. ఇంకా కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. తొలుత 7వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఎస్కే బాబి, నూర్‌బాషా సంఘం డైరెక్టర్ షేక్ సోఫియా దంపతులు బాలినేనికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఎందేటి కోటేశ్వరమ్మ రంగారావు, ప్రవీణ్‌కుమార్, గోపీచంద్, కో ఆప్షన్ మెంబర్ వర్దు శేషయ్య, ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఘనశ్యాం, డివిజన్ అధ్యక్షుడు జఫరుల్లా, నాయకులు చెంచురామయ్య, వెంకట్రావు చౌదరి, తాళ్లపాలెం శ్రీనివాసరావు, సైదా, ఆవుల సురేంద్ర, బొమ్మినేని మురళి, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, జమ్ము శ్రీకాంత్, జమ్ము రత్తయ్య, భాస్కర్, శ్రీకాంత్, రావూరి బుజ్జి, సురేష్, మారెళ్ల శ్రీను, జానీ, బైరెడ్డి అరుణ, సత్యనారాయణ రెడ్డి, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

యథావిధిగానే ఎన్నికలు

● సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: సోషల్ మీడియాలో వస్తున్నట్లుగా అసెంబ్లీ ఎన్నికలు ముందస్తుగా జరగవని, షెడ్యూల్ ప్రకారమే యథావిధిగా జరుగుతాయని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. సంతనూతలపాడులో శనివారం నిర్వహించిన సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు వేయించాలి

ఒంగోలు రూరల్: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని వలేటివారిపాలెం గ్రామంలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉలిచి పశువైద్యాధికారిణి డాక్టర్ ఐ.ప్రతిమ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం, నోరు, కాళ్ల గిట్టల్లో పుండ్లు ఏర్పడటం, పశువుల మేత, నీరు తీసుకోకపోవడం, సూడి పశువులు ఈసుకుపోవడం జరుగుతుందన్నారు. పాల ఉత్పత్తి తగ్గిపోవడం, వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన దూడలు చనిపోవడం, ఎద్దు, కోడెలలో పనిచేసే సామర్థ్యం తగ్గిపోవడం తదితర లక్షణాలతో బాధపడతాయన్నారు. దీనివలన పాడి రైతులకు ఆర్థికంగా అధిక నష్టం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో వలేటివారిపాలెం గ్రామంలోని పశుపోషకులందరూ పశువైద్య సిబ్బందికి పూర్తి సహకారం అందించి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేయించాలని డాక్టర్ ప్రతిమ కోరారు. ఇప్పటి వరకు గ్రామంలో మొత్తం 27 తెల్ల పశువులకు, 400 నల్ల పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నలమోతు ఉషారాణి, కరవది వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కె.లక్ష్మయ్య, షేక్ జుబీర్, మోటా కల్పనా దేవి, పశుసంవర్థకశాఖ సహాయకులు, పశుపోషకులు, రైతులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న డాక్టర్ ప్రతిమ

నాంచారమ్మ తల్లి స్థల వివాదం పరిష్కారం



స్థల వివాదంపై మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

కొత్తపట్నం: నాంచారమ్మ తల్లి ఆలయ స్థల వివాదం తారాస్థాయికి చేరింది. నాంచారమ్మ తల్లి ఎదురుగా ఉన్న స్థలాన్ని స్థానికులు ఉపయోగించుకుంటున్నారు. ఆలయానికి ఆ స్థలం అవసరమని, దానిని ఖాళీ చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఖాళీ చేసేది లేదని, తమ వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని స్థానికులు చెప్పడంతో కమిటీ సభ్యులు స్థలాన్ని ఖాళీ చేయించి ట్రాక్టర్‌తో మట్టిని లెవలింగ్ చేస్తున్నారు. స్థలం యజమానులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ బీవీ రమణారావుకు ఫిర్యాదు చేశారు. ఆలయానికి చేరుకుని స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్.. స్థల యజమానులతో, ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. గుడి, బడి, ప్రాజెక్టులు, ఇతర గ్రామ అవసరాల నిమిత్తం అవసరమైతే స్థలాన్ని ఇవ్వాలని స్పష్టంగా వివరించారు. ఆలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని, ఎదురుగా ఉన్న స్థలం ఇళ్లకు పనిరాదని చెప్పారు. ఆలయ కమిటీ నుంచి నష్టపరిహారం తీసుకుని స్థలాన్ని ఆలయానికి స్వాధీనం చేయాలని స్థల యజమానులకు చెప్పారు. తిరునాళ్లు, ఉత్సవాలు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉంటుందని, తప్పనిసరిగా స్థలం ఇవ్వాలని సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. తహసీల్దార్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు కోడూరి బ్రహ్మారెడ్డి, తంబి కాంతారావు, కోడూరి బండి శ్రీను, గౌరవరపు శివాజీ, రాగాల వెంకటేశ్వర్లు, కాపు గౌరవరపు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

817 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం-2లో శనివారం 817 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వేలం కేంద్రానికి 1005 బేళ్లు రాగా, 131 బేళ్లు నోబిడ్ అయ్యాయి. కేజీ గరిష్ట ధర రూ.200 కాగా, కనిష్ట ధర రూ.165, సరాసరి ధర రూ.192గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవునికి శాంతి కల్యాణం



ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి



కిట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: పదో తరగతి విద్యార్థినులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రకాశ్‌బాబు అన్నారు. స్థానిక పీవీఆర్ బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు శనివారం హైజిన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల గురించి ఎక్కువగా ఊహించుకుని ఆందోళన పడవద్దని సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, హెడ్‌మాస్టర్లు బంకా ప్రసన్న, సయ్యద్ మస్తాన్‌బీ, పోతినేని పద్మావతి, ఆరిగ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న షంషేర్ అలీబేగ్

మార్కాపురం: స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న గ్లోబల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం కళాశాల చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్ ప్రారంభించారు. జార్జ్ ఇంజినీరింగ్ కళాశాల, కిట్స్ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన కిట్స్ కళాశాల టీం 8 ఓవర్లలో 58 పరుగులు చేయగా, జార్జ్ కళాశాల 6 ఓవర్లలోనే 58 పరుగులు చేసి విజేతగా నిలిచింది. కాగా ఇండియాలోనే ప్రఖ్యాత మోటివేటర్ బీఆర్ షఫీ శనివారం సాయంత్రం కళాశాల్లో జరిగిన కార్యక్రమంలో చేసిన ప్రసంగం విద్యార్థులను ఆలోచింపజేసింది. లక్ష్య సాధనకు, వ్యక్తిత్వానికి, విద్యా వికాసానికి షఫీ చేసిన సూచనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ షంషేర్ అలీబేగ్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్ శ్రీధర్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ రఫీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులకు టీకాలు వేయించాలి



పశువైద్య శిబిరంలో టీకాలు వేస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని నాగులుప్పలపాడు ఏడీఏ డాక్టర్ నాగభూషణం అన్నారు. శనివారం మాచవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరం, పశు విజ్ఞాన బడి కార్యక్రమాలను గ్రామ సర్పంచ్ ఇనగంటి సీతారావమ్మ, వెంకట రమణారెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు పశువుల ఆరోగ్యం, వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 20 చూడి పరీక్షలు, 35 సాధారణ పరీక్షలు చేయడంతో పాటు 215 నల్ల పశువులకు, 35 తెల్ల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు అమ్మనబ్రోలు పశువైద్యాధికారి డాక్టర్ జి.వి.సురేఖ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పశువైద్య సహాయకులు శైలజ, ప్రసన్న, మంజుల, రంగనాథ్, మహేష్, వెంకట్రావు, సురేష్ పాల్గొన్నారు.

శేష వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు



శేష వాహనంపై స్వామివారు

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో వేంచేసియున్న శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజు శేష వాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో దేవస్థానం పరిసరాలు కిటకిటలాడాయి. సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలను వల్లూరి వెంకటేశ్వర్లు బృందం ప్రదర్శించింది. శ్రీకృష్ణ రాయబారం నాటకం భక్తులను ఆకట్టుకుంది.

కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వాహణాధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, దార్ల వెంకట రమణమ్మ, జూటూరి గీతాకుమారి, నెమ్మాని హరిప్రియ, సూపర్‌బజార్ డైరెక్టర్ వి.మురళి, దేవస్థాన అర్చకస్వాములు రమానాథ్, కూరపాటి ఆంజనేయ అవధాని, త్రినాథ్ చక్రవర్తి, నాగార్జునదేవ్, శ్రీధర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని ఓ దృశ్యం

ఏపీలో రోడ్ల నిర్మాణంపై మాగుంట ప్రశ్న

ఒంగోలు టౌన్: ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రోడ్ల ఏర్పాటు గురించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామ, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ఆమోదించిన, మంజూరు చేసిన, నిర్మించిన రోడ్ల గురించి ఆయన ప్రశ్నించారు. ఇందుకోసం విడుదల చేసిన నిధులు, వినియోగించిన నిధుల వివరాలను తెలియజేయాలని కోరారు. మాగుంట శ్రీనివాసులరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయక మంత్రి సాధ్వి సరంజన్ జ్యోషి సమాధానమిచ్చారు. రాష్ట్ర వాటాలతో గ్రామీణ రోడ్లను 2019-20లో 27,652 కిలోమీటర్ల మేరకు వేయడానికి ఆమోదించగా, 27,304 కిలోమీటర్ల నిర్మాణం జరిగిందని తెలిపారు. 2020-21లో 44,018 కి.మీ ఆమోదించగా, 36,685 కి.మీ నిర్మాణం జరిగిందని వెల్లడించారు. 2019-20లో 476.27 కోట్లు కేంద్రం వాటా కాగా, రాష్ట్ర వాటాతో కలిసి 338.84 కోట్లు ఖర్చయినట్లు వివరించారు. 2020-21లో 53.20 కోట్లు కేంద్రం వాటా కాగా, రాష్ట్ర వాటాతో కలిపి 396.75 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.

2021-22లో కేంద్రం వాటా 50 కోట్లకుగానూ రాష్ట్ర వాటాతో కలిపి 508.86 కోట్లు ఖర్చయిందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రాల ప్రతిపాదనలు, నిర్మాణ సామర్థత, ఖర్చు చేయని మొత్తాల ఆధారంగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రాల కోరికపై ఈ పథకం మూడో దశ అమలు కాలాన్ని 2025 మార్చి వరకు పొడిగించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం



పట్టు వస్త్రాలు తెస్తున్న ఉభయదాతలు

కొనకనమిట్ల: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్లగట్టు గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన రాములోరి రథోత్సవం కన్నుల పండువలా సాగింది. వేదపండితులు వినుపాముల రామకృష్ణశర్మ, శేఖరశర్మల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో, భజన బృందాలతో గొట్లగట్టు పురవీధుల్లో రథాన్ని లాగుతుండగా భక్తులు విరివిగా పాల్గొని తిలకించారు. మహిళలు పోటీలు పడి రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ, చీతిరాల మాలకొండయ్య కుమారుడు వెంకటేశ్వర్లు పులిహోరా అందజేశారు. అనంతరం గ్రామంలో వసంతోత్సవం, దొంగల దోపిడీ నిర్వహించారు.



ఉత్సవంలో స్వామి వారు

5న కృత్రిమ అవయవాల క్యాంపు

పొదిలి రూరల్: ఈ నెల 5న మార్కాపురం ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో జరిగే ఉచిత కృత్రిమ అవయవాల క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం పొదిలి మండలంలోని పొదిలి పట్టణంతో పాటు కాటూరివారిపాలెం, మాదాలవారిపాలెం, అక్కచెరువు, మల్లవరం, పోతవరం, కంభాలపాడులో ప్రచారం నిర్వహించారు. ఎంపీడీఓ పి. శ్రీకృష్ణ, ఏపీఎం మాణిక్యరావు, ఎస్సై మల్లికార్జునరావును కలిశారు. దేవళ్ల ఆంజనేయులు, బత్తిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన కొనసాగింపే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: సుపరిపాలన కొనసాగింపే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక రైస్ మిల్ వద్ద శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కుటుంబంలా సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసేవలో జగనన్నకు తోడుగా ఉండాలని మంత్రి సురేష్ పిలుపునిచ్చారు. ప్రజలకు జగనన్న చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని టీడీపీ చూసి ఓర్వ లేకపోతోందన్నారు. ఈ నెల 7 నుంచి జరిగే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో విజయవంతం చేయాలన్నారు. ప్రజల అండదండలే వైఎస్సార్ సీపీకి పునాదులన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గం పరిధిలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుడదని, తన సొంత నిధులతో సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్ పాల్గొన్నారు.